క్లుప్తంగా

120 మందికి ఉచిత వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం గుడివాడకు చెందిన శ్రియమ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పి గల వారికి వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో స్త్రీలకు సంబంధించిన రుగ్మతలపై పరీక్షలు నిర్వహించి ఆయుర్వేదంలో వాటి పరిష్కారానికి కావలసిన సలహాలు, సూచనలతో పాటు ఉచిత మందుల పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జీఎల్ వెంకట్, డాక్టర్ ఉదయకీర్తి, డాక్టర్ కేఎల్ఎంకే ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకు ఇళ్లు దగ్ధం



నర్సన్నపాలెం(మొవ్వ): మండల కేంద్రమైన మొవ్వ శివారు నర్సన్నపాలెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో కాకి శ్రీనివాసరావుకు చెందిన ఇంటిలోని విలువైన వస్తువులు, నగదు అగ్నికి ఆహుతై సుమారు రూ.2.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పక్కనే ఉన్న కైలా దుర్గా ప్రసాదరావుకి చెందిన తాటాకు ఇంటికి కూడా మంటలు వ్యాపించటంతో రూ.40 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు మొవ్వ అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

మానవత్వం చాటుకున్న కూచిపూడి ఎస్ఐ



కూచిపూడి(మొవ్వ): నిడుమోలు గ్రామంలోని ప్రధాన రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన యువకుడి కుటుంబానికి కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ నగదు మొత్తాన్ని బుధవారం మృతుడు రాజేష్ తండ్రి అంజయ్యకు అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించటానికి ఆటో కిరాయి రూ.1400 కూడా ఎస్ఐ తానే చెల్లించి మానవత్వాన్ని చాటుకున్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



గుడివాడటౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆసుపత్రులలో అగ్నిప్రమాదాలు నివారణ అంశంపై స్థానిక ఏలూరు రోడ్‌లోని హోమియో రీసెర్చ్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి జె.ఆంజనేయులు మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో హోమియో రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌జే రాజ్‌కుమార్, సైంటిస్ట్ డాక్టర్ బి.రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కైకలూరు: అగ్నిప్రమాద నివారణ పద్ధతులపై ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలని కైకలూరు అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సిబ్బందికి బుధవారం అవగాహన కలిగించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన తక్షణ చర్యలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

వేసవిలో అగ్ని ప్రమాదాలను నిరోధించాలి

పామర్రు: వేసవిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరగటానికి అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నిరోధించాలని పామర్రు విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎన్.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం గ్రామంలోని పెట్రోల్ బంకువద్ద అగ్ని ప్రమాదాల నివారణ జాగ్రత్తలపై ప్రజలకు పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, గ్యాస్ వినియోగించే చోట సెల్‌ఫోన్‌లను వాడరాదన్నారు. ప్రతి సంస్థలోనూ ఫైర్ ఎస్టింగ్ విషర్‌లు అయిన కార్బన్ డైయాక్సైడ్ తదితరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

త్వరలోనే ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అధికారులతో కాలనీలో వసతుల గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటామని, లేఅవుట్‌ను మెరుగుపర్చి త్వరలోనే ప్లాట్లను పంపిణీ చేస్తామని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు గ్రామంలోని జగనన్న కాలనీని ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక సమస్యల కారణంగా నిలుపుదల చేసిన ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఆ సమస్యలు పరిష్కరించి త్వరలో లబ్ధిదారులకు అందజేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మెరక పనులు చేసి సరీ్వసు రాళ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో కొందరు రైతులు ప్లాట్ల పంపిణీకి అడ్డంకులు ఏర్పాటు చేశారని ఈ విషయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని, హామీలను నెరవేర్చిన తర్వాతే ప్లాట్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కొనుగోలు చేసిన కొంత భూమిని ఫ్యాక్టరీకి మినహాయించాల్సి వచ్చిందని అన్నారు. ఈ నేపథ్యంలో మరికొంత భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించే నిమిత్తం ఈనెల 21వ తేదీన జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్ జగనన్న కాలనీకి వస్తారని చెప్పారు. ఆ సమయంలో రైతులు అందరూ అందుబాటులో ఉండాలని అన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కుల, మత, ప్రాంత, పార్టీ భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేశామని ఎమ్మెల్యే కైలే అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉన్నవారు ఉంటే ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, మహేష్, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, నందిపు నాంచారయ్య, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, బి.మధురెడ్డి, నందిరాజు, సింహాచలం, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- మండవల్లి మండలంలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం
- సహకరించిన నాయకులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



కానుకొల్లులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: రాష్ట్రంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందజేస్తూ, వారి ఉన్నతికి అహర్నిశలు శ్రమించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని కానుకొల్లులో సర్పంచ్ నాగదాసి థామస్, ఎంపీటీసీ పుట్టి మీనాకుమారి ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గడపగడపలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, ముంగర మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేటోయిన వీర్రాజు, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ బి.గోకర్ణయాదవ్, బలే నాగరాజు, పుట్టి సత్యనారాయణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.యేసోబురాజు, గుడివాడ తమ్ముస్వామి, సర్పంచ్‌లు మెండా ఝాన్సీ, జంపన వీరబాబు, బుర్ల భోగేశ్వరరావు, బొబ్బిలి రత్తయ్యనాయుడు, మెండా సురేష్, వెలుగు సీసీ అమల, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు. మండవల్లి మండలంలో బుధవారంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అభినందనలు తెలిపారు. కానుకొల్లు హైస్కూల్లో గడపగడపకు ముగింపు సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



బొమ్మినంపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన కొనసాగిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు శివారు రామచంద్రాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆ సమస్యలను శాఖల వారీగా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కరేటి గోవిందరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, దాసరి చిరంజీవి, యర్రా శ్రీను, దాసరి అరుణకుమారి పాల్గొన్నారు.

27న పెదమద్దాలి దేవాలయ భూముల కౌలు వేలం

పెదమద్దాలి(పామర్రు): గ్రామంలోని దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్దండ వేణుగోపాలస్వామి దేవస్థానానికి సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు గల భూములకు ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి కె.వెంకటరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే నం.419లో గల 7.48 ఎకరాలు, రీ సర్వేనం.514లో గల 2.4 ఎకరాలు మొత్తం వెరసి 9.91 ఎకరాల మాగాణి భూమి ఉన్నదని అన్నారు. ఈ భూములకు 3 ఏళ్ల కాల పరిమితికి లీజు హక్కుకు (భూమిలో వ్యవసాయానికి సంబంధించిన పంట వేసుకొను కౌలు హక్కుకు) ఈనెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో కౌలు వేలం పాట నిర్వహిస్తామన్నారు. పాటలో పాల్గొను వారు రూ.10 వేల ధరావత్తుగా చెల్లించి పాల్గొనాలన్నారు. పాట అయిన వెంటనే పాట మొత్తం అడ్వాన్సు కౌలుగా చెల్లించాలని, మిగిలిన రెండేళ్ల ప్రతి సంవత్సరం మే 31వ తేదీ నాటికి కౌలును ముందుగానే చెల్లించి భూమిలోకి దిగాలని అన్నారు. మిగిలిన పాట షరతులు పాట సమయంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

వేములమడ(మొవ్వ): వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం వేములమడ గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తీసుకు వచ్చిన సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే అనిల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వంపై టీడీపీ చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ సందర్భంగా రైతులు ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు ఇప్పించాలని, ఇంకా కొనుగోలు చేయకుండా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రోడ్లు అభివృద్ధి చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు పునరుద్ధరించామని చెప్పారు. ప్రథమ ప్రాధాన్యంగా రోడ్లపై ఉంచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో రోడ్డు వేయటానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ముందుగా కాజ గ్రామ శివారులోని ఆర్‌సీఎం చర్చిని బిషప్ తెలగతోటి రాజారావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్‌లు కొడాలి భవాని, వేములమడ సీతారామయ్య, ఎంపీటీసీలు వేకేటి వెంకటలక్ష్మి, సమ్మెట ఆంజనేయులు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు మెండు



రైతులకు విత్తనాల బ్యాగ్‌లను అందిస్తున్న సర్పంచ్ గంగాభవాని, ఎంపీటీసీ మధుబాబు

పామర్రు(తోట్లవల్లూరు): ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తే మంచి లాభాలతో పాటుగా నేల సారవంతం అవుతుందని గ్రామ సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ మధుబాబు అన్నారు. తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ భూములు ఉన్న వారు అందరూ 32 రకాల విత్తనాలతో వేసవిలో సాగు చేయాలని అన్నారు. దీని వలన నత్రజని శాతం పెరిగి భూములు బాగా పండుతాయని అన్నారు. కషాయాలు తయారు చేసుకుని వాటిని భూమిలో వాడటం వలన పంట ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. కిచెన్ గార్డెన్స్ వేసి 365 రోజులు కూరగాయలను పండించుకుని, వాటిని వినియోగించుకోవడం వలన కుటుంబంలో అనారోగ్య సమస్యలు రావని అన్నారు. 32 రకాల విత్తనాల ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘ వీవోఏ పి.సుధారాణి, వి.కళ్యాణి, ఐసీఆర్‌పీ భవ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేలు ఆర్థిక సహాయం

అవురుపూడి(మొవ్వ): మొవ్వ మండలం అవురుపూడి పీఏసీఎస్ సభ్యుడైన నాగులపాటి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆ రైతు కుటుంబానికి సొసైటీ రూ.10వేలను మట్టి ఖర్చుల నిమిత్తం అందచేసింది. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుక్కల శ్రీనివాసరావు, కార్యదర్శి దోమతోటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు వై.తారకబ్రహ్మం, వై.సత్యనాంచారమ్మ పాల్గొని వెంకటేశ్వరరావు భార్య రెడ్డిమ్మకు నగదు అందజేశారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కొడాలి వితరణ



ఇమామ్‌లు, మోజాన్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడ్లవల్లేరు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉపవాసాల సమయంలో ఉపయోగించే ఇఫ్తార్ విందులో వినియోగించే గంజికి అయ్యే 30 రోజుల ఖర్చును గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) వితరణగా అందించారు. మండలంలోని పెంజెండ్ర మసీదులో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరు మండలంలో 18 మసీదులకు గంజి ఖర్చుతో పాటు ఇమామ్‌లు, మోజాన్లకు దుస్తుల పంపిణీని కొడాలి నాని చేపట్టారని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ గుడివాడ అధ్యక్షుడు షేక్ బాజీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీల కన్వీనర్ బలుసు జితేంద్ర, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీమ్, పార్టీ నాయకులు పోలికొండ నాగేశ్వరరావు, తాజుద్దీన్, ఇబ్రహీం, సర్పంచి రేమల్లి తాతబ్బాయ్, పీఏసీఎస్ అధ్యక్షుడు తీపూఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో సమస్యల వెల్లువ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు పంచాయతీల్లో బుధవారం జరిగిన గ్రామసభల్లో ప్రజలు పలు సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. మండలంలోని సంఘర్షణపురం, వైవాక, ఊటుకూరు, బిరావిగుంట గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. వైవాకలో సర్పంచ్ నున్నా పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దళితవాడకు చెందిన ప్రజలు పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలోని రెండు దళితవాడలకు కలిపి ఒకే శ్మశాన వాటిక ఉందని దీనికి వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నందున నూతనంగా రోడ్డు వేయడంతో పాటు శ్మశానవాటికలో షెడ్డు నిర్మించాలని కోరారు. శ్మశాన స్థలం రెండు దళితవాడలకు చాలనందున స్థలసేకరణ చేయాలని కోరారు. గ్రామంలోని మూడు దళితవాడలకు జలజీవన్ మిషన్ ద్వారా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి పరిశుభ్రమైన తాగునీరందించాలని స్థానిక నాయకుడు జోషి అధికారులను కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పద్మావతి, కార్యదర్శి జి.రమేష్ తెలిపారు. ఊటుకూరు, బిరావిగుంట సభల్లో పలు స్థానిక సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



గుడివాడలో గౌతు లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు



కైకలూరులో గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

గుడివాడ టౌన్: సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గౌడ సంఘం, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం, వైఎస్సార్ సీపీ ఇతర పార్టీల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కాకర్ల వీధి సంతరోడ్‌లో గల గౌతు లచ్చన్న విగ్రహానికి సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లచ్చన్న తన రాజకీయ జీవితంలో అధికార పక్షం నుంచి ఎన్ని అవకాశాలు వచ్చినా ఆజన్మాంతం ప్రతిపక్ష నాయకునిగానే గడిపి పేదల పక్షాన పోరాడారని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు శొంఠి ఆంజనేయులు, కార్యదర్శి శొంఠి అయ్యప్ప, గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ గోవర్ధన, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు వి.నరసింహారావు, సీహెచ్ భాస్కరరావు, మాదాసు వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లం రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావులకొల్లు మల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దారం ఏడుకొండలు, పలువురు గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

కైకలూరులో...

కైకలూరు: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని గౌడ సంఘ నాయకులు బుధవారం కైకలూరులో ఘనంగా నిర్వహించారు. తాలూకా సెంటర్‌లో గౌతు లచ్చన్న విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాల కోసం చివరివరకు పోరాడారన్నారు. కార్యక్రమంలో కట్ట ఏసుబాబు, మారగాని గణపతి, పామర్తి రాంబాబు, కట్టా నాగరాజు పాల్గొన్నారు.

మండవల్లిలో...

మండవల్లి: మండవల్లిలో గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న పాటుపడ్డారని ప్రశంసించారు. తొలుత గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు, లచ్చన్న అభిమానులు పాల్గొన్నారు.

సమైక్యతకు నిదర్శనం ఇఫ్తార్ విందు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ఇఫ్తార్ విందులో ముస్లింలకు వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు(తోట్లవల్లూరు): సర్వ మానవ సౌభ్రాతృత్వానికి సమైక్యతకు ఇఫ్తార్ విందు ఎంతగానో ఉపయుక్తం అవుతుందని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అందరూ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ముస్లింలకు ఎమ్మెల్యే స్వయంగా విందు వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారపు శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ పీఎస్ కోటేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్, వార్డు సభ్యురాలు అమీరున్నీసా, బ్యాంక్ అధ్యక్షుడు పడమటి హరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో విశ్వభారతి వార్షికోత్సవం

గుడివాడటౌన్: స్థానిక విశ్వభారతి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. విశ్వభారతి డైరెక్టర్ మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రతిభను కనపర్చిన దామిని, వర్షిణి, పావనిల నృత్య ప్రదర్శన, అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన జోషికా శ్యామల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్వభారతి వ్యవస్థాపకుడు పొట్లూరి శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ రాధ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు పరామర్శ

ముదినేపల్లి రూరల్: బొమ్మినంపాడులో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వాసిపల్లి బసవయ్య కుటుంబ సభ్యులను బుధవారం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పరామర్శించారు. ప్రభుత్వపరంగా తగిన సాయమందించేందుకు కృషి చేస్తానన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

మండలంలోని సంఘర్షణపురానికి చెందిన సంకుల రామాంజనేయులు కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మరణించాడు. ముదినేపల్లికి చెందిన వైద్యుడు మనోజ్ స్పందించి రామాంజనేయులు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీయాలి



కుట్టుమిషన్‌లు ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: ప్రతి విద్యార్థి లోనూ అనేక నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన మెగా లెజెండ్స్ సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మెగా లెజెండ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనింగ్ రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ బాలికల పాఠశాలలో అత్యుత్తమ శిక్షణ ఇస్తూ వారిని ప్రోత్సహించాలని తాము నిర్ణయించామని అందుకు కావలసిన పూర్తి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్.భీమేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.మంగతాయారు, కోశాధికారి ఆర్‌డీ ప్రసాదు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జీవీవీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ధర్మేంద్రకుమార్, నారాయణ, రాజేశ్వరి, పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత విలువలను కాపాడాలి



వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పామర్రు: సమాజంలోని ప్రతి ఒక్కరూ మానవత విలువలు కాపాడినప్పుడే శాంతి భద్రతలతో సమాజం సుభిక్షంగా ఉంటుందని పామర్రు ఎస్ఐ పీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పామర్రు మానవత సేవ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బందరు రోడ్డులోని వాసవీ వృద్ధ శరణాలయంలో బుధవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అల్లూరి నాగేశ్వరరావు సంస్మరణార్థం వారి కుమారుడు, మండల రెవెన్యూ సహాయ అధికారి అల్లూరి రాము వితరణతో వృద్ధులకు అన్నదానం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మానవత సంస్థ రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బొమ్మారెడ్డి కోటిరెడ్డి, కార్యదర్శి అరిగల బాలుడు, కన్వీనర్ ఎన్.త్రివిక్రమరావు, డైరెక్టర్‌లు పామర్తి వెంకట నారాయణ, రెడ్రౌతు నర్సింహారావు, కొల్లా శ్రీనివాసరావు, ఘంటసాల భరతుడు, తుంగల వేణు ప్రసాద్, చలమలశెట్టి బాబు, కె.శ్రీధర్ పాల్గొన్నారు.